22-05-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

# " మధురమైన పిల్లలారా - ఏకాంతంలో కూర్చొని మీతో మీరే మాట్లాడుకోండి, " నేను అవినాశి ఆత్మను, తండ్రి ద్వారా వింటున్నాను " - అని అభ్యాసము చేయండి "

**ప్రశ్న:-** స్మృతి విషయంలో నిర్లక్ష్యంగా ఉన్న పిల్లల నోటి నుండి ఏ మాటలు వెలువడ్తాయి ?

**జవాబు:-** వారు మేము శివబాబా పిల్లలమే. స్మృతిలోనే ఉన్నామని చెప్తారు. కాని బాబా, అవన్నీ కోతలే (వ్యర్థ ప్రలాపాలు). అలా అనడం నిర్లక్ష్యము అని అంటారు. ఇందులో పురుషార్థం చేయాలి. ఉదయమే లేచి స్వయాన్ని ఆత్మగా భావించి కూర్చోవాలి. ఆత్మిక సంభాషణ చేయాలి. ఆత్మనే సంభాషిస్తుంది. ఇప్పుడు మీరు దేహీ-అభిమానులుగా అవుతారు. దేహీ - అభిమాని పిల్లలే స్మృతి చార్టును వ్రాస్తారు. కేవలం జ్ఞానమే మాట్లాడ్తూ ఉండరు.

**పాట :-** ముఖము చూచుకో ప్రాణీ!......... (ముఖ్‌డా దేఖ్‌లే ప్రాణీ!.........)

ఓంశాంతి. ఆత్మిక పిల్లలకు ప్రాణమంటే ఆత్మ అని అర్థం చేయించడం జరిగింది. తండ్రి ఇప్పుడు ఆత్మలకు అర్థం చేయిస్తున్నారు - ఈ పాట భక్తిమార్గానికి చెందినది. ఇక్కడ కేవలం దీని సారాంశము అర్థం చేయించబడ్తుంది. మీరిప్పుడు ఇక్కడ కూర్చున్నప్పుడు స్వయాన్ని ఆత్మగా భావించండి. దేహ భావాన్ని వదిలేయాలి. ఆత్మ అయిన నేను చాలా చిన్న బిందువును. ఈ శరీరము ద్వారా పాత్ర చేసేది నేనే. ఈ ఆత్మ జ్ఞానము ఎవ్వరికీ లేదు. తండ్రి చెప్తున్నారు - స్వయాన్ని నేనొక ఆత్మను అని భావించండి. నేను చిన్న ఆత్మను. ఈ శరీరము ద్వారా ఆత్మయే మొత్తం పాత్రనంతా అభినయిస్తుంది. ఇలా అనుకుంటే దేహాభిమానము వదిలి పోతుంది. ఇదే కష్టము. ఆత్మలైన మనము ఈ మొత్తం నాటకంలో పాత్రధారులము. అత్యంత శ్రేష్ఠమైన పాత్రధారి పరమపిత పరమాత్మ వారు కూడా ఇంత చిన్న బిందువే అని, వారి మహిమ చాలా గొప్పదని బుద్ధిలో ఉంటుంది. వారు జ్ఞాన సాగరులు, సుఖసాగరులు కాని చాలా చిన్న బిందువే. ఆత్మలైన మనము కూడా చిన్న బిందువులమే. దివ్యదృష్టి లేకుండా ఆత్మను చూడలేము. ఈ కొత్త కొత్త విషయాలు ఇప్పుడే మీరు వింటున్నారు. ఈ విషయాలు ప్రపంచానికి తెలియవు. మీలో కూడా కొద్దిమందికి మాత్రమే యథార్థంగా తెలుసు. వారి బుద్ధిలో మనము ఆత్మలమని చిన్న బిందువులమని, మన తండ్రి ఈ డ్రామాలో ముఖ్య పాత్రధారి అని ఉంటుంది. అత్యంత ఉన్నతమైన పాత్రధారి తండ్రి. ఆ తర్వాత ఫలానా ఫలానావారు వస్తారు. తండ్రి జ్ఞానసాగరులని మీకు తెలుసు. కాని శరీరము లేకుండా జ్ఞానము వినిపించలేరు. శరీరము ద్వారానే మాట్లాడగలరు. అశరీరులుగా అవ్వడం వల్లనే కర్మేంద్రియాలు వేరైపోతాయి. భక్తిమార్గములో దేహధారులనే స్మృతి చేస్తారు. పరమపిత పరమాత్ముని నామ, రూప, దేశ, కాలాల గురించి తెలియదు. కేవలం పరమాత్మ నామ-రూపాలకు అతీతమని అంటారు. తండ్రి అర్థము చేయిస్తున్నారు - డ్రామానుసారము మీరు ఎవరైతే నంబరువన్ సతోప్రధానంగా ఉండేవారో, ఇప్పుడు మళ్ళీ మీరే సతోప్రధానంగా అవ్వాలి. తమోప్రధానము నుండి సతోప్రధానంగా అయ్యేందుకు మీరు ఈ స్థితిని దృఢంగా ఉంచుకోవాలి - మేము ఆత్మలము. ఆత్మ ఈ శరీరము ద్వారా మాట్లాడ్తుంది. ఆత్మలోనే జ్ఞానముంది. మన ఆత్మలో 84 జన్మల పాత్ర అవినాశిగా ఉందనే జ్ఞానము ఇతరులెవ్వరి బుద్ధిలోనూ లేదు. ఇవి చాలా కొత్త కొత్త పాయింట్లు. ఏకాంతంలో కూర్చొని మీతో మీరు ఇలా మాట్లాడుకోండి -

నేను ఆత్మను, తండ్రి ద్వారా వింటున్నాను. నా ఆత్మలో ధారణ అవుతుంది. ఆత్మనైన నాలోనే పాత్ర నింపబడి ఉంది. నేను ఆత్మను, అవినాశిని. ఇది లోపల బాగా నూరుకోవాలి(అభ్యాసం చేవాలి). నేను ఇప్పుడు తమోప్రధానం నుండి సతోప్రధానంగా అవ్వాలి. దేహాభిమాన మనుష్యులకు ఆత్మను గురించిన జ్ఞానము కూడా లేదు. చాలా పెద్ద పెద్ద పుస్తకాలు(గ్రంథాలు) వారి వద్ద ఉంచుకుంటారు. వారికి ఎంత అహంకారముంది! ఇది తమోప్రధాన ప్రపంచము. అత్యంత శ్రేష్ఠమైన ఆత్మ ఎవ్వరూ లేరు. ఇప్పుడు మనము తమోప్రధానం నుండి సతోప్రధానంగా అయ్యే పురుషార్థము చేయాలని మీకు తెలుసు. ఈ విషయాలన్నీ లోపల బాగా నూరాలి(వల్లించుకోవాలి). జ్ఞానము వినిపించేవారైతే చాలామంది ఉన్నారు. కానీ స్మృతి(యోగము) లేనే లేదు. లోపల అంతర్ముఖత ఉండాలి. మనము తండ్రి స్మృతి ద్వారా పతితుల నుండి పావనంగా అవ్వాలి. కేవలం పండితులుగా అవ్వరాదు. దీనిని గురించి ఒక పండితుని ఉదాహరణ కూడా ఉంది - మాతలకు రామ-రామ అంటూ ఉంటే ఆవలి తీరానికి చేరుకుంటారని చెప్పేవాడు... కాని తాను దాటలేడు. ఈ విధమైన గొప్పలు చెప్పరాదు. ఇటువంటివారు చాలామంది ఉన్నారు.

చాలా బాగా అర్థము చేయిస్తారు. కాని యోగము లేనే లేదు. రోజంతా దేహాభిమానములోనే ఉంటారు. లేకుంటే - నేను ఈ సమయంలో నిదురలేస్తాను - ఇంత సమయము స్మృతి చేస్తానని బాబాకు చార్టు పంపాలి. కాని ఆ సమాచారమే పంపరు. జ్ఞాన ప్రగల్భాలు చాలా చెప్తూ ఉంటారు. యోగమే లేదు. భలే గొప్ప గొప్పవారికి జ్ఞానమిస్తారు. కాని యోగములో కచ్చాగా ఉన్నారు. ఉదయమే నిదురలేచి తండ్రిని స్మృతి చేయాలి. బాబా మీరు ఎంత ప్రియమైనవారు! ఈ విచిత్ర డ్రామా ఎలా తయారయ్యిందో - ఈ రహస్యము ఎవ్వరికీ తెలియదు. ఆత్మను గురించి గాని, పరమాత్మను గురించి గాని ఎవ్వరికీ తెలియదు. ఈ సమయంలో మనుష్యులు జంతువుల కంటే హీనంగా ఉన్నారు. మనము కూడా అలాగే ఉండేవారము. మాయ రాజ్యములో చాలా దుర్గతి పాలయ్యాము. ఈ జ్ఞానము మీరు ఎవ్వరికైనా అర్థము చేయించవచ్చు. ఆత్మలైన మీరిప్పుడు తమోప్రధానంగా ఉన్నారు. మీరు సతోప్రధానంగా అవ్వాలి. మొదట స్వయాన్ని ఆత్మగా భావించమని చెప్పండి. పేదలకైతే ఇంకా చాలా సులభము. ధనవంతులకైతే చాలా బంధనాలుంటాయి.

తండ్రి చెప్తున్నారు - నేను సాధారణ శరీరములోనే వస్తాను. చాలా పేదవాడూ కాదు, చాలా ధనవంతుడూ కాదు. కల్ప-కల్పము తండ్రి వచ్చి పావనంగా ఎలా తయారవ్వాలో మనకు శిక్షణనిస్తారు. పోతే మీ వ్యాపారాలు మొదలైన వాటిలో చాలా గొడవలున్నాయి. బాబా వాటి కొరకు రాలేదు. ఓ పతితపావనా! రండి అని నన్ను పిలుస్తారు. కనుక పావనంగా అయ్యే యుక్తిని బాబా తెలుపుతారు. ఈ బ్రహ్మకు కూడా ఏమీ తెలిసేది కాదు. పాత్రధారులుగా ఉండి డ్రామా ఆది-మధ్య-అంత్యములు తెలియకుంటే వారిని ఏమనాలి? మనము ఆత్మలము. ఈ సృష్టిచక్రములో పాత్రధారులమని కూడా ఎవ్వరికీ తెలియదు. భలే ఆత్మ మూలవతనంలో నివసిస్తుందని అంటారు. కాని అనుభవముతో చెప్పరు. మీకు ఇప్పుడు ప్రాక్టికల్‌గా తెలుసు - ఆత్మలమైన మనము మూలవతనవాసులము. మనము అవినాశి ఆత్మలము. ఇది బుద్ధిలో గుర్తుండాలి. చాలామందికి యోగము బొత్తిగా లేదు. దేహాభిమానము వలన చాలా తప్పులు కూడా జరుగుతాయి. ముఖ్యమైన విషయము - దేహీ-అభిమానులుగా అవ్వడం. మేము సతోప్రధానంగా అవ్వాలనే చింత ఉండాలి. ఏ పిల్లలకైతే సతోప్రధానంగా అయ్యే పట్టుదల

ఉందో వారి నోటి నుండి ఎప్పుడూ రాళ్లు వెలువడవు. ఏదైనా తప్పు జరిగితే వెంటనే - "బాబా! మేము ఈ తప్పు చేశాము, క్షమించండి అని బాబాకు తెలుపుతారు, దాచిపెట్టరు." దాచిపెడ్తే అది ఇంకా వృద్ధి చెందుతుంది. బాబాకు సమాచారమిస్తూ ఉండండి. మీ యోగము బాగా లేదని బాబా వ్రాస్తారు. పావనంగా అవ్వడమే ముఖ్యమైన విషయము. పిల్లలైన మీ బుద్ధిలో 84 జన్మల కథ ఉంది. వీలైనంత సతోప్రధానంగా అవ్వాలనే చింత సదా ఉండాలి. దేహాభిమానాన్ని వదిలేయాలి. మీరు రాజఋషులు. హఠయోగులు ఎప్పుడూ రాజయోగము నేర్పించలేరు. రాజయోగమును నేర్పించేది తండ్రి ఒక్కరే. జ్ఞానము కూడా తండ్రి ఒక్కరు మాత్రమే ఇస్తారు. ఈ సమయంలో మిగిలి ఉండేదంతా తమోప్రధాన భక్తి. కేవలం సంగమ యుగములో మాత్రమే తండ్రి వచ్చి జ్ఞానము వినిపిస్తారు. తండ్రి వచ్చారు కనుక భక్తి సమాప్తమవుతుంది. ఈ ప్రపంచము కూడా సమాప్తమైపోతుంది. జ్ఞాన-యోగాల ద్వారా సత్యయుగము స్థాపన అవుతుంది. భక్తి వేరే విషయము. సుఖ-దుఃఖాలన్నీ ఇక్కడే ఉన్నాయని మనుష్యులు అంటారు. ఇప్పుడు పిల్లలైన మీ పై పెద్ద బాధ్యత ఉంది. మీ కళ్యాణము కొరకు యుక్తులు రచిస్తూ ఉండండి. పావన ప్రపంచమంటే శాంతిధామము, సుఖధామమని తెలుపబడింది. ఇది అశాంతిధామము, దుఃఖధామము. మొట్టమొదట ముఖ్యమైన విషయము - యోగము. యోగము లేకుండానే జ్ఞానము గొప్పగా(చాలా బాగా) చెప్తారు. కేవలం పండితుని వలె చెప్తూ ఉంటారు. ఈ రోజులలో క్షుద్రవిద్యలు కూడా చాలా వెలువడ్డాయి. వీటికి జ్ఞానముతో సంబంధము లేదు. మనుష్యులు అసత్యములో ఎంతగానో కూరుకొనిపోయారు. పతితులుగా ఉన్నారు. తండ్రి స్వయంగా చెప్తున్నారు - నేను పతిత ప్రపంచములో పతిత శరీరములో వస్తాను. ఇక్కడ పావనులు ఒక్కరు కూడా లేరు. ఇతను స్వయాన్ని భగవంతుడనని చెప్పుకోరు. నేను కూడా పతితుడనే అని చెప్తున్నారు. పావనంగా అయితే ఫరిస్తా(సూక్ష్మదేవత)గా అయిపోతారు. మీరు కూడా పవిత్రంగా అవుతే ఫరిస్తాలుగా అవుతారు. కనుక మనము పావనంగా ఎలా అవ్వాలి అనేదే ముఖ్యమైన విషయము. స్మృతి చాలా అవసరము. ఏ పిల్లలైతే స్మృతిలో నిర్లక్ష్యంగా ఉంటారో వారు - "మేము శివబాబా పిల్లలమే కదా, స్మృతిలోనే ఉన్నాము" అని అంటారు. కాని అవన్నీ ప్రగల్భాలే, వారి నిర్లక్ష్యము అని బాబా చెప్తున్నారు. అందుకు పురుషార్థము చేయాలి. ఉదయమే లేచి స్వయాన్ని ఆత్మగా భావించి కూర్చుండిపోవాలి. ఆత్మిక సంభాషణ చేయాలి. సంభాషించేది ఆత్మనే కదా. ఇప్పుడు మీరు దేహీ-అభిమానులుగా అవుతారు. ఎవరికైనా కళ్యాణము చేస్తే వారి మహిమ కూడా చేయబడ్తుంది కదా. అది దేహ మహిమ. ఇది నిరాకార పరమపిత పరమాత్మని మహిమ. ఇది కూడా మీకు తెలుసు. ఈ సోపానాలు(సీఢీ) ఇతరుల బుద్ధిలో ఉండవు. మనము 84 జన్మలెలా తీసుకుని క్రిందకు దిగుతూ వస్తామో ఇందులో తెలుస్తుంది. ఇప్పుడు పాపముతో భాండము(కుండ) నిండిపోయింది. అది శుభ్రమెలా అవ్వాలి? అందుకే తండ్రిని పిలుస్తారు. మీరు పాండవ సంప్రదాయానికి చెందినవారు. మీరు ధర్మ శక్తి గలవారే కాక రాజ్య శక్తి గలవారు కూడా. బాబా అన్ని ధర్మాల(రిలీజన్) గురించి తెలుపుతారు. ఇతరులెవ్వరూ తెలుపలేరు. పోతే ఆ ధర్మస్థాపన చేయువారు ఏం చేస్తారు. వారి వెనుక ఇతర ఆత్మలు కూడా క్రిందికి రావలసి వస్తుంది. అయితే వారెవ్వరూ మోక్షమివ్వలేరు. చివర్లో తండ్రే స్వయంగా వచ్చి అందరినీ పవిత్రులుగా చేసి వాపసు తీసుకెళ్తారు. కనుక వారికి తప్ప ఇతరులెవ్వరికీ మహిమ లేదు. బ్రహ్మకు గాని, మీకు గాని ఏ మహిమా లేదు. బాబా రానట్లయితే మీరు కూడా ఏం చేసేవారు? ఇప్పుడు తండ్రి మిమ్ములను

ఉన్నతమయ్యే కళలోకి తీసుకెళ్తారు, దాని ద్వారా అందరికీ మేలు కలుగుతుంది(ఉడ్‌తీ కళా తేరే బానే సర్వ్ కా భలా........) అనే మహిమ కూడా ఉంది. కానీ ఏ మాత్రము అర్థము చేసుకోరు. చాలా మహిమ చేస్తారు.

ఇప్పుడు తండ్రి అర్థం చేయించారు - ఆత్మ అకాల్, ఇది ఆత్మ ఉండే సింహాసనము(భృకుటి), ఆత్మ అవినాశి. ఆత్మను మృత్యువు ఎప్పుడూ కబళించదు. ఆత్మ ఒక శరీరాన్ని వదిలి మరొక శరీరముతో పాత్రను అభినయించాలి. అంతేకాని తీసుకెళ్లేందుకు ఏ కాలుడు(మృత్యువు) రాడు. ఎవరు శరీరాన్ని వదిలినా మీకు దుఃఖము కలుగదు. ఈ శరీరాన్ని వదిలి మరో పాత్రను అభినయించేందుకు వెళ్లింది. కనుక ఏడ్చే(విలపించే) అవసరమేముంది? ఆత్మలైన మనమంతా భాయి-భాయి(సోదరులము). ఈ విషయం కూడా మీరు ఇప్పుడే తెలుసుకున్నారు. ఆత్మ, పరమాత్మ చాలాకాలము వేరుగా ఉండినారు............. అని గానము కూడా చేస్తారు. తండ్రి వచ్చి ఎక్కడ కలుస్తారో కూడా తెలియదు. ఇప్పుడు మీకు ప్రతి విషయము గురించిన జ్ఞానము లభిస్తుంది. ఎంతో కాలము నుండి వింటూనే వస్తున్నారు. వీరు ఏ పుస్తకము మొదలైనవి తీసుకోరు. కేవలం అర్థము చేయించేందుకు రెఫర్ చేస్తారు. తండ్రి సత్యమైనవారు కనుక సత్యమైన రచనను రచిస్తారు. సత్యమే చెప్తారు. సత్యముతో జయిస్తారు, అసత్యముతో ఓడిపోతారు. సత్యమైన తండ్రి సత్య ఖండమును స్థాపన చేస్తారు. రావణుని ద్వారా మీరు చాలా ఓడిపోయారు. ఇదంతా తయారైన ఆట. మన రాజ్యము స్థాపన అవుతూ ఉందని ఇప్పుడు మీకు తెలుసు. తర్వాత ఇదెప్పుడూ జరగదు. వీరంతా వెనుక వచ్చినవారు. ఈ సృష్టి చక్రమును బుద్ధిలో ఉంచుకోవడం ఎంతో సులభము. ఏ పిల్లలైతే మంచి పురుషార్థము చేస్తున్నారో, వారు మేము జ్ఞానము చాలా బాగా వినిపిస్తున్నామని, అంత మాత్రానికే సంతోషించరు, దానితో పాటు యోగము, దైవీగుణాలను కూడా ధారణ చేస్తారు. మీరు చాలా చాలా మధురంగా అవ్వాలి. ఎవ్వరికీ దుఃఖమునివ్వరాదు. ప్రీతిగా అర్థం చేయించాలి. పవిత్రత పై చాలా గొడవలు జరుగుతాయి. అది కూడా డ్రామానుసారమే జరుగుతుంది. ఇది తయారైన డ్రామా కదా. అలాగని డ్రామాలో ఉంటే లభిస్తుందని భావించరాదు, కష్టపడాలి. దేవతల వంటి దైవీగుణాలు ధారణ చేయాలి. ఉప్పునీరుగా అవ్వరాదు. తప్పుగా నడుచుకొని తండ్రి గౌరవాన్ని పోగొట్టుట లేదు కదా? అని పరిశీలించుకోవాలి. సద్గురువు నిందకులకు స్వర్గంలో స్థానముండదు. వీరు సత్యమైన తండ్రి, సత్యమైన టీచరు. ఇప్పుడు ఆత్మకు స్మృతి కలుగుతుంది. బాబా జ్ఞానసాగరులు, సుఖసాగరులు. తప్పకుండా జ్ఞానమిచ్చి వెళ్లాను. అందుకే నాకు మహిమ ఉంది. ఇతని ఆత్మలో జ్ఞానమేమైనా ఉండేదా? ఆత్మ అంటే ఏమిటో, డ్రామా అంటే ఏమిటో ఎవ్వరికీ తెలియదు. మనుష్యులే కదా తెలుసుకోవలసింది. రుద్రయజ్ఞాన్ని రచించినప్పుడు ఆత్మలను కూడా పూజిస్తారు. వారి పూజ మంచిదా? లేక దైవీ శరీరాల పూజ మంచిదా? ఈ శరీరము పంచ తత్వాలది. కనుక ఒక్క శివబాబా పూజ మాత్రమే అవ్యభిచారి పూజ. ఇప్పుడు ఆ ఒక్కరితోనే వినాలి. అందుకే చెడు వినకు,............ గ్లాని చేయు మాటలేవీ వినకండి. నా ఒక్కరి నుండే వినండి. ఇది అవ్యభిచారి జ్ఞానము. ముఖ్యమైన విషయము - దేహాభిమానము తెగిపోయినప్పుడే మీరు శీతలంగా అవుతారు. తండ్రి స్మృతిలో ఉంటే, నోటితో తప్పు మాటలు మాట్లాడరు. కు దృష్టి(చెడు దృష్టి) ఉండదు. చూస్తూ కూడా చూడనట్లుండాలి. మన జ్ఞాన మూడవ నేత్రము తెరవబడింది. తండ్రి వచ్చి త్రినేత్రి త్రికాలదర్శిగా చేశారు. ఇప్పుడు మీకు మూడు కాలాల జ్ఞానము,

మూడు లోకాల జ్ఞానముంది. అచ్ఛా.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. జ్ఞానము వినిపించుటతో పాటు యోగము కూడా చేయాలి. మంచి గుణాలను ధారణ చేయాలి. చాలా మధురంగా అవ్వాలి. నోటి నుండి ఎప్పుడూ రాళ్ళు(కఠిన వాక్కులు) వెలువడరాదు.

2. అంతర్ముఖులుగా అయి ఏకాంతములో కూర్చొని, మీతో మీరు ఆత్మిక సంభాషణ చేయాలి. పావనంగా అయ్యేందుకు యుక్తులు వెతకాలి. ఉదయము ఉదయమే నిదురలేచి తండ్రిని చాలా ప్రీతిగా స్మృతి చేయాలి.

## వరదానము :- " అందరి నుండి హృదయపూర్వకమైన ప్రేమను ప్రాప్తి చేసుకునే న్యారే ప్యారే నిస్సంకల్ప భవ "

ఏ పిల్లలకైతే న్యారే, ప్యారేగా ఉండే గుణము లేక నిస్సంకల్పంగా ఉండే విశేషత ఉందో అనగా ఎవరికైతే ఈ వరదానం ప్రాప్తించిందో వారు అందరికి ప్రియంగా అవుతారు. ఎందుకంటే న్యారేపన్ ద్వారా(అతీతత్వం) అందరి హృదయపూర్వక ప్రేమ స్వతహాగా ప్రాప్తి అవుతుంది. వారు తమ శక్తిశాలి నిస్సంకల్ప స్థితి మరియు శ్రేష్ఠ కర్మల ద్వారా అనేకమందికి సేవ చేసేందుకు నిమిత్తంగా అవుతారు. అందువలన స్వయం కూడా సంతుష్టంగా ఉంటారు, ఇతరుల కళ్యాణం కూడా చేస్తారు. వారికి ప్రతి కార్యంలో సఫలత స్వతహాగా ప్రాప్తి అవుతుంది.

## స్లోగన్ :- " "ఒక్క బాబా " అనే శబ్ధమే సర్వ ఖజానాలకు తాళంచెవి. ఈ తాళంచెవిని సదా భద్రంగా ఉంచుకోండి. "